

సీఎం స్టాలిన్‌ను కలిసి డీఎంకే కూటమికి మద్దతు ప్రకటించిన సమత్తువ మక్కల్ కళగం నేత ఎర్నావూరు ఎ.నారాయణన్ తదితరులు

కొలిక్కిరాని సీట్ల పంపిణీ

● సీనియర్ నేతలతో స్టాలిన్ చర్చలు

అడయార్, మార్చి 5: వచ్చే లోక్‌సభ ఎన్నికల కోసం కూటమిలోని భాగస్వామ్య పార్టీలకు సీట్ల పంపిణీ ఇంకా ఒక కొలిక్కి రాకపోవడంతో ముఖ్యమంత్రి, డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ అసంతృప్తిని వ్యక్తం చేస్తూ, మంగళవారం అందుబాటులో ఉన్న పార్టీ సీనియర్ నేతలతో అత్యవసరంగా సమావేశమయ్యారు. ఇందులో మిత్రపక్షాలకు సీట్ల కేటాయింపుపై నెలకొన్న చిక్కు ముడులపై ప్రధానంగా చర్చించారు. పార్టీ సీనియర్ నేతలు దురైమురుగన్, టీఆర్‌బాలు సహా మరికొందరు సీనియర్ నేతలు పాల్గొన్న ఈ సమావేశంలో భాగస్వామ్య పార్టీలకు కేటాయించాల్సిన సీట్లు, ఉత్పన్నమవుతున్న సమస్యలు, తదితర అంశాలపై ఆయన ఆరా తీశారు. డీఎంకే కూటమిలోని కాంగ్రెస్, ఎండీఎంకే, లెఫ్ట్ పార్టీల, వీసీకే, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్, కొంగునాడు మక్కల్ కట్చితో పాటు కమల్ హాసన్ పార్టీ మక్కల్ నీది మయ్యం కూడా ఉంది. వీటిలో కమ్యూనిస్టు పార్టీలకు రెండు సీట్లు, ముస్లీం లీగ్, కొంగునాడు పార్టీలతో ఒక్కో సీటు కేటాయించారు. అయితే, స్థానాల పేర్లు మాత్రం ఇంకా ఖరారు చేయలేదు. కూటమిలోని మిగిలిన పార్టీలైన కాంగ్రెస్, డీఎండీకే, వీసీకే, ఎంఎన్‌ఎం పార్టీలకు ఎన్ని సీట్లు చొప్పున కేటాయించాలన్న దానిపై సందిగ్ధత నెలకొంది. అంతేకాకుండా, వీసీకేకు కేటాయించే సీట్లలో ఆ పార్టీ సొంతంగా ఎన్నికల గుర్తుపై పోటీ చేయాలని భావిస్తుంది. ఈ విషయంపై కూడా ఈ సమావేశంలో చర్చించినట్టు తెలుస్తుంది. ఈ నేపథ్యంలో డీఎంకేతో సీట్ల పంపిణీపై వీసీకే నేతలు బుధవారం మరోమారు చర్చలు జరుపనున్నారు. కాగా, సీట్ల పంపిణీ అంశంపై మిత్రపక్ష పార్టీలతో సంప్రదించేందుకు పార్టీ సీనియర్ నేత టీఆర్ బాలు నేతృత్వంలో ఒక కమిటీని సీఎం స్టాలిన్ ఏర్పాటు చేసిన విషయం తెల్సిందే.

డీఎంకేకు కాంగ్రెస్ డెడ్‌లైన్

కాగా, సీట్ల పంపిణీ అంశం తేల్చకుండా కాలయాపన చేస్తున్న డీఎంకేకు కాంగ్రెస్ నేతలు షరతు విధించారు. ఈ నెల ఏడో తేదీ లోపు ఏదో ఒకటి తేల్చాలని వారు తేల్చి చెప్పారు. ఈ సీట్ల పంపిణీపై డీఎంకే - కాంగ్రెస్ పార్టీల మధ్య ఇంకా రెండో దఫా చర్చలే ప్రారంభంకాలేదు. అదేసమయంలో డీఎంకేలో మాత్రం పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థులు దరఖాస్తు గడువు ఏడో తేదీతో ముగియనుంది. అదేరోజున సీట్ల పంపిణీపై స్పష్టత ఇవ్వాలని రాష్ట్ర కాంగ్రెస్ నేతలు కోరుతున్నారు. ఇదే విషయాన్ని డీఎంకే సీనియర్ నేతలకు కూడా ముఖ్యమంత్రి స్టాలిన్ స్పష్టత కూడా ఇచ్చారు. అందుకే కాంగ్రెస్ నేతలు కూడా ఏడో తేదీలోపు సీట్ల పంపిణీ అంశానికి ఫుల్‌స్టాఫ్ పెట్టాలని కోరుతున్నారు.

మోదీతో రహస్య భేటీనా?

● అదంతా నెటిజన్ల పుకార్లు ● మంత్రి పళనివేల్ త్యాగరాజన్

చెన్నై, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల మదురైలో పర్యటించినప్పుడు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి పీటీఆర్ పళనివేల్‌రాజన్ రహస్యంగా కలుసుకున్నారంటూ సామాజిక మాధ్యమాల్లో విడుదలైన ఫొటోలు తీవ్ర కలకలం సృష్టించాయి. మంత్రి పళనివేల్‌రాజన్ బీజేపీకి దగ్గరవుతున్నారని, త్వరలో డీఎంకేకి గుడ్‌బై చెప్పనున్నారని కూడా సోషల్ మీడియాలో కథనాలు కూడా వచ్చాయి. అదే సమయంలో ఆ ఫొటోలు నకిలీవని కూడా నెటిజన్లు ఖండించారు. ఈ నేపథ్యంలో మంత్రి పళనివేల్‌రాజన్ ప్రధాని మోదీని కలుసుకోవడం వెనుక ఎలాంటి ప్రాధాన్యం లేదని, ప్రభుత్వపరంగానే కలుసుకున్నానని వివరణ ఇచ్చారు. మంగళవారం ఉదయం నగరంలో ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండటం వల్లే ప్రధాని నరేంద్రమోదీ తరచూ రాష్ట్రంలో పర్యటిస్తున్నారని, పదేళ్లుగా అధికారంలో ఉన్నప్పటికీ ప్రధాని తుఫాను బాధితులను ఓదార్చేందుకు, బాధిత ప్రాంతాల్లో పర్యటించేందుకుగానీ రాలేదని విమర్శించారు. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో కొన్ని సీట్లయినా గెలుచుకోవాలనే దురాశతోనే ఆయన తరచూ రాష్ట్రంలో పర్యటిస్తున్నారని ఎద్దేవా చేశారు చెన్నై సహా నాలుగు జిల్లాల్లో మిచౌంగ్ తుఫాను, తిరునల్వేలి సహా నాలుగు జిల్లాల్లో వర్షబీభత్సం నెలకొన్నా ప్రధాని ఆ జిల్లాల్లో పర్యటించేందుకు ఆసక్తి చూపలేదని, దీనిని బట్టే తమిళులపై ఆయనకున్న ప్రేమ ఎలాంటిదో స్పష్టమవుతుందన్నారు. ఇక ప్రభుత్వ ప్రోటోకాల్ ప్రకారమే తాను ప్రధానిని కలుసుకున్నానని, ఆ సమయంలో ఇద్దరం కాసేపు మాట్లాడుకున్నామని, అంత మాత్రానికే తాను డీఎంకేకు గుడ్‌బై చెప్పనున్నట్లు నెటిజన్లు పుకార్లు పట్టించడం గర్హనీయమన్నారు. ఫిబ్రవరి 27న ప్రధాని స్వాగతం పలికే మంత్రుల్లో తాను కూడా ఒకడినని, హోటల్‌లో బస చేసిన ప్రధానిని ప్రభుత్వం తరఫున మర్యాదపూర్వకంగా కలుసుకున్నాని చెప్పారు. ఇదివరలోనూ ప్రధాని మోదీకి స్వాగతం పలికినా ఇన్ని విమర్శలు తనపై రాలేదని పీటీఆర్ పళనివేల్‌రాజన్ స్పష్టంచేశారు.



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి పీటీఆర్ పళనివేల్ రాజన్

ఎన్నికల విధులకు 3.32 లక్షల మంది ఉద్యోగులు

● ఈసీ సత్యప్రద సాహు



చెన్నై, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో త్వరలో జరుగనున్న లోక్‌సభ ఎన్నికలకు 3.32 లక్షమంది ఉద్యోగుల సేవలను వినియోగించుకోనున్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి సత్యప్రదసాహు తెలిపారు. మంగళవారం సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల భద్రతకు ఇప్పటికే 15 కంపెనీల పారామిలటరీ దళాలను రప్పించామని, వీటిలో గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ పరిధిలో రెండు కంపెనీలు, ఆవడి, తాంబరం, కోయంబత్తూరు, తిరుప్పూరు, సేలం, తిరుచ్చి, మదురై, తిరునల్వేలి కార్పొరేషన్‌లలో తలా ఒక కంపెనీ దళాలను పంపినట్లు చెప్పారు. కోయంబత్తూరు సర్కిల్‌లో కోయంబత్తూరు, తిరుప్పూరు, ఈరోడ్, నీలగిరి ప్రాంతాలకు రెండు కంపెనీల పారామిలటరీ దళాలను పంపామని చెప్పారు. మదురై, విరుదునగర్ ప్రాంతాలకు తలా ఒక కంపెనీ చొప్పున పంపుతున్నట్లు చెప్పారు. తిరునల్వేలి సర్కిల్‌లో తిరునల్వేలి, తూత్తుకుడి, కన్నియాకుమారి, తెన్‌కాశికి రెండు కంపెనీల పారామిలటరీ దళాలను పంపినట్లు చెప్పారు. మూడు రోజుల వ్యవధిలో 15 కంపెనీల పారామిలటరీ దళాలను భద్రతా ఏర్పాట్లకు నియమించినట్టు ఆయన వివరించారు. ఈ నెల 7న రానున్న 10 కంపెనీల పారామిలటరీల దళాలను కాంచీపురం సర్కిల్‌లోని కాంచీపురం, తిరువళ్లూరు, చెంగల్పట్టు ప్రాంతాలకు తలా ఒక కంపెనీ చొప్పున, వేలూరు సర్కిల్‌లోని వేలూరు, తిరువణ్ణామలై, రాణిపేట, తిరుపత్తూరు ప్రాంతాలకు తలా ఒక కంపెనీ చొప్పున పంపుతామన్నారు. ప్రస్తుతం ఎన్నికల విధులను నిర్వర్తించేందుకు అవసరమైన సిబ్బంది ఎంపిక ముమ్మరంగా జరుగుతోందని, 68 వేల పోలింగ్ కేంద్రాలకు ఒక్కో పోలింగ్ కేంద్రానికి ఐదుగురు చొప్పున మొత్తం 3.32 లక్షల మంది సిబ్బందిని నియమిస్తామని తెలిపారు. ఈవీఎంల తొలిదశ పరిశీలన, తనిఖీ ముగిసిందని, వాటిని నియోజకవర్గాల వారీగా పంపేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు.

40 నియోజకవర్గాలకు బీజేపీ అభ్యర్థుల జాబితా సిద్ధం

అడయార్, మార్చి 5: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లోని 40 లోక్‌సభ స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థుల కోసం భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా, ఆ పార్టీ కీలక నేతల సమావేశం మంగళవారం జరిగింది. అందులో నేతల అభిప్రాయాలను సేకరించారు. అలాగే, ఒక్కో నియోజకవర్గానికి ముగ్గురు చొప్పున ఎంపిక చేసి, ఆ జాబితాను బీజేపీ అధిష్ఠానానికి పంపారు. అయితే, బీజేపీ శ్రేణుల్లో అంచనా మేరకు.. సెంట్రల్ చెన్నైలో ఖుష్బూ, ఉత్తర చెన్నైలో కరు నాగరాజన్, కోయంబత్తూరులో అన్నామలై, నామక్కల్‌లో కేపీ రామలింగం, పుదుచ్చేరి లేదా దక్షిణ చెన్నైలో నిర్మలా సీతారామన్ పోటీ చేయొచ్చని భావిస్తున్నారు. అలాగే, కూటమిలో ఉన్న ఏసీ షణ్ముగంకు వేలూరు, పారివేందర్‌కు పెరంబలూరు, దేవనాథన్ యాదవ్‌కు రామనాథపురం సీట్లను కేటాయించాలని నిర్ణయం తీసుకుంది. అదేవిధంగా దినకరన్ పార్టీకి, మాజీ ముఖ్యమంత్రి ఓపీఎస్‌కు రెండు సీట్లు చొప్పున కేటాయించి రెండు పార్టీలను తమ కూటమిలో చేర్చుకోవాలని భావిస్తున్నారు. బీజేపీ రాష్ట్ర శాఖ పంపిన అభ్యర్థుల జాబితాను పరిశీలించి పార్టీ అధిష్ఠానం త్వరలో అధికారికంగా జాబితా విడుదల చేయనుందని పార్టీ రాష్ట్ర నాయకులు చెబుతున్నారు.

చెన్నై, కీళక్కరైల్లో ఎన్‌ఐఏ సోదాలు

అడయార్, మార్చి 5: సంచలనం సృష్టించిన బెంగళూరు రామేశ్వరం కేఫ్ పేలుడు ఘటనతో పాటు బెంగుళూరు పరప్పణ అగ్రహార సెంట్రల్ జైలులో లష్కరే తోయిబా ఖైదీలకు ఉగ్రవాద భావజాలం బోధిస్తున్నట్టు నమోదైన కేసు దర్యాప్తులో భాగంగా ఎన్‌ఐఏ నగరంలోని మన్నడి, రామనాథపురం జిల్లా కీళక్కరై సహా దేశ వ్యాప్తంగా ఆరు రాష్ట్రాల్లో సోదాలు నిర్వహించింది. చెన్నైలో జరిగిన సోదాల తర్వాత ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. కీళక్కరైలో జరిపిన సోదాల్లో ఒక ల్యాప్‌టాప్‌తో పాటు పలు సిమ్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. బెంగళూరు రామేశ్వరం బేకరీలో పేలుళ్ళ తర్వాత అప్రమత్తమైన ఎన్‌ఐఏ దేశంలోని ఉగ్రవాద సానుభూతిపరులున్న ప్రాంతాల్లో సోదాలు చేస్తోంది. చెన్నై నగరంలో మన్నడి, రామనాథపురం జిల్లా కీళక్కరైలో ఈ తనిఖీలు జరిగాయి. మన్నడిలో ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారణ కోసం తమ వెంట తీసుకెళ్ళారు. అలాగే, కీళక్కరైలో కూడా పలు ఇళ్లల్లో సోదాలు చేసిన ఎన్‌ఐఏ అధికారులు.. ఒక ల్యాప్‌టాప్ సహా ఆరు సిమ్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. కాగా, ఎన్‌ఐఏ అధికారులు మొత్తం ఏడు రాష్ట్రాల్లో 17 చోట్ల సోదాలు చేశారు.



జయ నగల అప్పగింతపై హైకోర్టు స్టే

పెరంబూర్, మార్చి 5: దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత నగలు తమిళనాడు ప్రభుత్వానికి అప్పగించడంపై తాత్కాలిక స్టే విధిస్తూ కర్ణాటక హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. ఆస్తుల కేసులో జయలలిత నుంచి స్వాధీనం చేసుకున్న బంగారం, వెండి, వజ్రాలతో కూడిన నగలు కర్ణాటక ప్రభుత్వ ట్రెజరీలో ఉంచారు. జయలలిత నగలను వేలం వేయాలనే పిటీషన్ విచారించిన బెంగళూరు ప్రత్యేక న్యాయస్థానం, జయలలిత నగలు తమిళనాడు ప్రభుత్వానికి అప్పగించాలని, ఈ కేసును తమిళనాడు నుంచి కర్ణాటకకు మార్చినందున కేసు ఖర్చుల కోసం రూ.5 కోట్లు తమిళనాడు ప్రభుత్వం కర్ణాటకకు చెల్లించాలని ఇటీవల తీర్పు వెలువరించింది. ఈ నేపథ్యంలో, జయలలిత నగలు తమిళనాడు ప్రభుత్వానికి అప్పగించే తీర్పుపై స్టే విధించాలని కోరుతూ దీప, దీపక్‌లు కర్ణాటక హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ మంగళవారం విచారించిన హైకోర్టు, ప్రత్యేక న్యాయస్థానం తీర్పుకు తాత్కాలిక స్టే విధిస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

శంకుస్థాపన జరిగిన ఐదేళ్ళకు..

మదురై ఎయిమ్స్‌కు భూమిపూజ !



తోప్పూరులో మదురై ఎయిమ్స్ ఆస్పత్రి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న అధికారులు

చెన్నై, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మదురై ఎయిమ్స్ ఆసుపత్రి నిర్మాణ పనులకు మంగళవారం ఉదయం భూమి పూజ జరిగింది. మదురై జిల్లా తోప్పూరు వద్ద 222 ఎకరాల్లో ఎయిమ్స్ ఆస్పత్రి ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం 2018 డిసెంబర్‌లో ఆమోదించింది. తర్వాత 2019 జనవరిలో ప్రధాని నరేంద్రమోదీ ఆ ఆస్పత్రికి అట్టహాసంగా శంకుస్థాపన చేశారు. దాని నిర్మాణానికి అయ్యే రూ.1977.8 కోట్ల వ్యయంలో జపాన్ సంస్థ నుంచి రూ. 1627,70 కోట్లు రుణం తీసుకుని, తక్కిన వ్యయాన్ని కేంద్ర ప్రభుత్వమే భరించేలా ప్రాజెక్టు రూపొందించారు. ఆ మేరకు ఆ స్థలం చుట్టూ ప్రహరీ గోడ నిర్మించారు. ఆ తర్వాత ఐదేళ్లుగా ఆ ఆస్పత్రి నిర్మాణానికి ఎలాంటి పనులు జరుగలేదు. 2023 ఆగస్టు 17న ఆస్పత్రి నిర్మాణానికి సంబంధించి టెండర్‌ను ఎయిమ్స్ ప్రకటించింది. ఆ తర్వాత గత జనవరిలో రామనాథపురం ప్రభుత్వ వైద్యకళాశాల ప్రాంగణంలో శిక్షణ పొందే ఎయిమ్స్ వైద్యకళాశాల విద్యార్థులు 150 మందికి చాలినంత స్థలం, శిక్షణ లభించకపోవడవంతో వారిలో వంద మందిని మదురైలోని అద్దె భవనంలోకి తరలించేందుకు ఎయిమ్స్ సంస్థ టెండర్లు పిలిచింది. ఆ మేరకు తిరుమంగళం ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వ ఆస్పత్రి నుంచి 10 కి.మీ. దూరంలో వందమంది విద్యార్థులకు అనువైన భవనాలను అద్దెకివ్వమంటూ ఆ టెండర్‌లో కోరింది.ఇక భవన నిర్మాణ పనులకు సంబంధించిన నిధులను కేంద్రప్రభుత్వ వాటాతో కలిపి రూ.1977.80 కోట్లను ప్రాజెక్టు వ్యయంగా పేర్కొన్నారు. అందులో తొలివిడతగా ఆస్పత్రి స్థలంలో రూ.10కోట్లతో ప్రహరీ గోడ నిర్మించారు. అదే సమయంలో రూ.21 కోట్లతో ఆసుపత్రికి వెళ్లేందుకు అనువైన రహదారులు కూడా నిర్మించారు. ఈ నేపథ్యంలో ఆస్పత్రి నిర్మాణానికి టెండర్లు ఖరారై కేంద్ర ఆరోగ్యమంత్రిత్వ శాఖ అనుమతి కూడా లభించడంతో మంగళవారం ఉదయం అధికారులు భూమి పూజ నిర్వహించారు. ప్రధాని మోదీ చేతుల మీదుగా శంకుస్థాపన చేసుకున్న ఎయిమ్స్ ఆస్పత్రి పనులు ఐదేళ్ల తర్వాత చురుకుగా సాగుతున్నట్లు అధికారులు ప్రకటించారు. పదంతస్థుల భవనసముదాయంతో 870 పడకల సదుపాయంతో ఈ ఎయిమ్స్ ఆస్పత్రిని నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. 33 నెలల్లోగా మదురై ఎయిమ్స్ ఆస్పత్రి నిర్మాణ పనులు పూర్తవుతాయని అధికారులు తెలిపారు. ఇక భూమి పూజ సందర్భంగా బోర్ల తవ్వకాలు కూడా నిర్వహించారు.

మోదీ ప్రభుత్వ కొత్త రికార్డు

● మదురై ఎయిమ్స్‌పై ఎంపీ వెంకటేశన్



మదురై ఎయిమ్స్‌పై కేంద్రప్రభుత్వ తీరును నిరసిస్తూ అఖిల పక్షల పార్టీల ఆందోళన (ఫైల్ ఫొటో)

పెరంబూర్, మార్చి 5: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎయిమ్స్ నిర్మాణపనులను కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిందని మదురై సీపీఎం ఎంపీ వెంకటేశన్ విమర్శించారు. మదురైలో ఎయిమ్స్ ఆస్పత్రి నిర్మాణపనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. 2019లో ఎయిమ్స్ ఆస్పత్రి నిర్మాణానికి ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేశారు. ఐదేళ్ల అనంతరం ప్రస్తుతం నిర్మాణపనులు ప్రారంభమయ్యాయి. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎయిమ్స్ నిర్మాణపనులను కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిందని ఎంపీ వెంకటేశన్, ఆరోగ్యశాఖ మంత్రి ఎం. సుబ్రమణ్యం ఆరో పిం చారు. ఈ విషయమై ఎంపీ వెంకటేశన్ తన 'ఎక్స్'లో... ఒక రహస్య ప్రాజెక్ట్‌లా మదురై ఎయిమ్స్ నిర్మాణపనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. గత వారం ప్రధాని మదురైకి వచ్చారు. ఆ సమయంలో ప్రధానిచే పనులు ప్రారంభించవచ్చు. భూమి పూజకు పనుల ప్రారంభానికి మధ్య ఐదేళ్లు అని కొత్త సాధన అని దేశ ప్రజలు భావిస్తున్నారని ఎంపీ ట్వీట్ చేశారు.

విలువల సమాహారం మహాభారతం!

● అంతర్జాతీయ సదస్సులో వక్తలు



రెండో రోజు సదస్సులో పాల్గొన్న ఆచార్య విస్తాలి శంకరరావు, ఆచార్య ఎల్బీ శంకరరావు తదితరులు

చెన్నై, మార్చి5 (ఆంధ్రజ్యోతి): మహాభారతం ప్రాచీన ఇతిహాసమే అయినా కుటుంబ, విద్య, సామాజిక విలువలు అంటూ ఎన్నో విలువల సమాహారమని పలువురు వక్తలు పేర్కొన్నారు. మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆధ్వర్యంలో 'కవిత్రయ మహాభారతం - వర్తమాన సమాజం సమాలోచన' అనే అంశంపై జరుగుతున్న అంతర్జాతీయ సదస్సు రెండో రోజు సమావేశాలు మంగళవారం ఉదయం రజతోత్సవ ప్రాంగణంలో ప్రారంభమయ్యాయి. తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య విస్తాలి శంకరరావు మాట్లాడుతూ మహాభారత ఇతివృత్తాన్ని ప్రస్తావించడం అంతర్జాతీయ సదస్సు లక్ష్యం కాదన్నారు. ఆ ఇతివృత్తాన్ని ఆధునిక సమాజ దృష్టితో చూడాల్సిన అవసరం ఉందన్నారు. రెండో రోజు ఐదో సమావేశానికి డా. పాండురంగం కాళియప్ప, ఆరో సమావేశానికి డా.బత్తుల అశోక్‌కుమార్, ఏడో సమావేశానికి డా. టీఆర్ఎస్ శర్మ, ఎనిమిదో సమావేశానికి డా. విశ్వర్షి వాసిలి వసంతకుమార్ అధ్యక్షత వహించారు. తొమ్మిదో సమావేశానికి డా. తిరుమల ఆముక్త మాల్యద, పదో సమావేశానికి డా. ఎం.మురళి, పదకొండో సమావేశానికి డా ఏ అంబ్రూణి అధ్యక్షత వహించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడుకు చెందిన పరిశోధకలు హాజరై, చక్కటి విశ్లేషణల చేశారు.

సూర్య, చంద్రప్రభల వాహనాలపై అమ్మవారి విహారం



ఊంజల్‌సేవలో పద్మావతీ అమ్మవారు

చెన్నై, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక టి.నగర్ జీఎన్ చెట్టి రోడ్డులోని టీడీడీ పద్మావతి అమ్మవారి ఆలయ బ్రహ్మోత్సవాల్లో బాగంగా మంగళవారం సూర్య ప్రభ, చంద్ర ప్రభ వాహనాల్లో అమ్మవారు కొలువుదీరి భక్తులను అనుగ్రహించారు. ఉదయం సూర్య ప్రభ వాహనంలో, మధ్యాహ్నం స్నప్న తిరుమంజన సేవలో, సాయంత్రం ఊంజల్ సేవలోనూ పద్మావతి అమ్మవారు భక్తులకు కనువిందు చేశారు. రాత్రి చంద్ర ప్రభ వాహనంలో మాడ వీధుల్లో ఊరేగారు. ఈ వేడుకల్లో స్థానిక సలహామండలి అధ్యక్షుడు ఏజే శేఖర్, సతీమణి జయశ్రీ, సభ్యులు శ్రీనివాసరెడ్డి, రాధాకృష్ణ, జయదేవ్, ఇంద్రా రాజేంద్రన్, మోహన్‌రావు, ఆలయ సూపరింటెండెంట్ పుష్పలత తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా బుధవారం ఉదయం 7.30 గంటలకు పద్మావతీ అమ్మవారి రథోత్సవం జరుగనుందని ఏజే శేఖర్ తెలిపారు.

సైన్స్ ఎగ్జిబిషన్‌లో తెలుగు విద్యార్థి ప్రతిభ

పెరంబూర్, మార్చి 5: రాష్ట్రప్రభుత్వం తరపున మదురైలో గత 24వ తేది సైన్స్ ఎగ్జిబిషన్ జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థాన బాలుర సెకండరీ స్కూలులో ప్లస్ వన్ చదువుతున్న తెలుగు విద్యార్థి కునగల త్రినాథ్ రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా తమిళనాడు తెలుగు పీపుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో త్రినాథ్ అభినందన సభ జరిగింది. ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు దేవరకొండ రాజు త్రినాథ్‌ను అభినందించి రూ.10 వేల చెక్, జ్ఞాపిక అందజేసి అభినందించారు. దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కాలం స్ఫూర్తితో, విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతవంతులు కావాలని సూచించారు. అలాగే, త్రినాథ్ చదువుకు అవసరమైన సహాయాలు చేస్తామని ఈ సందర్భంగా రాజు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ కిర్లంపల్లి శ్రీనివాసరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఓ.లీలారాణి, గురుమూర్తి, సతీష్‌బాబు, గౌరిశంకర్, జె.భవాని తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులను ప్రోత్సహించేలా తమిళనాడు తెలుగు పీపుల్ ఫౌండేషన్ చేతపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని హెచ్ఎం లీలారాణి కొనియాడారు.


త్రినాథ్‌ను సత్కరిస్తున్న దేవరకొండ రాజు, అతిథులు, నిర్వాహకులు

సమాచార దర్శిని

సెంట్రల్-మౌంట్ మధ్య అదనపు మెట్రోరైళ్లు

ఐసిఎఫ్, మార్చి 5: స్థానిక సెంట్రల్-సెయింట్ థామస్ మౌంట్ మధ్య అదనపు రైళ్లు నడపాలని చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) నిర్ణయించింది. విమానాశ్రయం-వింకోనగర్ మార్గంలో పీక్ అవర్స్‌లో 5 నిమిషాలకు ఒక రైలు, ఇతర సమయాల్లో 7 నిమిషాలకు ఒక రైలు నడుతున్నారు. అదే సమయంలో మౌంట్-సెంట్రల్ మధ్య పీక్ అవర్స్‌లో 10 నిమిషాలకు ఒక రైలు, ఇతర సమయాల్లో 20 నుంచి 30 నిమిషాల మధ్య ఒక రైలు నడుస్తుండడంతో ప్రయాణికులు చాలాసేపు వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ సమస్య పరిష్కరించేలా సెంట్రల్-మౌంట్ మధ్య అదనపు రైళ్లు నడపాలని సీఎంఆర్ఎల్ నిర్ణయించింది.

తగ్గిన పూల ధరలు

ఐసిఎఫ్,మార్చి5:స్థానిక కోయంబేడు మార్కెట్లో పూల ధరలు తగ్గాయి.దిండుగల్,మదురై, వేలూరు, నెలకోట, హోసూరు,తిరుచ్చి, సేలం, కర్ణాటక, ఆంధ్ర రాష్ట్రాలనుంచి ఈమార్కెట్‌కు పూలు దిగుమతవుతున్నాయి. ప్రస్తుతం శుభముహూర్తాలు,విశేషదినాలు లేకపోవడంతో కిలో మల్లెపూలు రూ.250, ఐస్ మల్లెలు రూ.200, అడవి మల్లెలు రూ.150, జాజి పూలు, కనకాంబరాలు రూ.300,గన్నేరు పూలు రూ.80, చామంతులు రూ.100, సంపంగి, పన్నీర్‌రోజ్ రూ.30, చాక్లెట్ రోజ్ రూ.40కు విక్రయమవుతున్నట్లు వ్యాపారులు తెలిపారు.

విద్యార్థులకు బ్యాంక్ ఖాతా ప్రారంభం

ఐసిఎఫ్, మార్చి 5: రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో 6వ తరగతిలో చేరేటప్పుడే విద్యార్థులకు బ్యాంక్ ఖాతా ప్రారంభించేందుకు పాఠశాల విద్యాశాఖ చర్యలు చేపట్టింది. వచ్చే విద్యా సంవత్సరం (2024-25)లో పాఠశాలలో చేరే సమయంలో అవసరమయ్యే ఆధారాలను ప్రధానోపాధ్యాయులు పొంది రెవెన్యూ శాఖ అధికారులకు పంపాలని సూచించింది. వాటిని పరిశీలించిన అనంతరం విద్యార్థుల పేరుతో బ్యాంక్ ఖాతాలు ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు.

రామేశ్వరం సందర్శనకు రూ.80 ఛార్జీ

ఐసిఎఫ్, మార్చి 5: రామేశ్వరంలో ముఖ్యమైన స్థలాలు సందర్శించేందుకు రవాణా శాఖ ఒకరికి రూ.80 ఛార్జీ నిర్ణయించింది. ఆధ్యాత్మిక, పర్యాటక స్థలాలను సందర్శించేందుకు ప్రత్యేక బస్సులను ఈ శాఖ నడపనుంది. తొలివిడతగా రామనాథస్వామి ఆలయం, అగ్నితీర్థం సముద్రతీరం, రామ, లక్ష్మణ, సీత తీర్థాలు, కలాం హౌస్, స్మారక స్థలాలను సందర్శించేలా ఉదయం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు బస్సులో ప్రయాణం చేసే సౌకర్యం కల్పించారు.

టూవేగా కేకే నగర్ రోడ్డు

ఐసిఎఫ్, మార్చి 5: ఐదేళ్ల అనంతరం స్థానిక కేకే నగర్ రోడ్డు మళ్లీ టూవేగా మారింది. మెట్రోవాటర్ బోర్డు పనులు జరుగుతున్న కారణంగా కేకే నగర్ నుంచి నెసపాక్కం, రామాపురం వెళ్లే 80 అడుగుల అన్నా మెయిన్ రోడ్డును వన్‌వేగా మార్చారు. ప్రస్తుతం పనులు పూర్తికావడంతో ఐదు సంవత్సరాల అనంతరం ఈ రోడ్డును టూవేగా మార్చారు.

ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, మార్చి 5: ఇంటిగ్రేటెడ్ సర్వీస్ సెంటర్‌లో ఖాళీగా ఉన్న పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్ధార్థ్ తెలిపారు. ఒప్పంద పద్ధతిలో పనిచేసేందుకు అర్హత, అనుభవం కలిగిన 35 ఏళ్లలోపుండి, డ్రైవింగ్ తెలిసిన చెన్నైకి చెందిన వారు ఈ నెల 13వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవచ్చు. మరిన్ని వివరాలకు chennai.nic.in అనే వెబ్‌సైట్ సంప్రదించవచ్చని కలెక్టర్ ఓ ప్రకటనలో తెలిపారు.

డిగ్రీ కోర్సులో చేరేందుకు యూజీసీ రాయితీ

ఐసిఎఫ్, మార్చి 5: మూడేళ్ల డిగ్రీ కోర్సుల్లో చేరిన వారు నాలుగేళ్ల కోర్సుల్లో చేరేందుకు యూజీసీ రాయితీ కల్పించింది.కేంద్రప్రభుత్వ కొత్తవిద్యా విధానం ప్రకారం పాఠశాల, ఉన్నత విద్యలో వివిధ మార్పులు చోటుచేసుకున్నాయి.ఈక్రమంలో,ఉపాధ్యాయవిద్యవంటి వివిధ శాఖల కోర్సులు వచ్చే విద్యా సంవత్సరంలో నాలుగేళ్లుగా మారనున్నాయి.ఈనేపథ్యంలో కళాశాలలకు యూజీసీ పంపిన సర్క్యులర్‌లో... రెండు, మూడేళ్ల డిగ్రీ కోర్సుల్లో ఈ విద్యా సంవత్సరం చదువుతున్నవారు, కొత్తగా ప్రారంభం కానున్న నాలుగేళ్ల డిగ్రీ కోర్సులో చేరేందుకు అవకాశం కల్పించాలని ఉత్తర్వులు జారీ చేసింది.

కాశి, అయోధ్యలకు ఆధ్యాత్మిక రైలు

ఐసిఎఫ్, మార్చి 5: రాష్ట్రం నుంచి కాశి, అయోధ్యలకు ప్రత్యేక ఆధ్యాత్మిక రైలు ఈ నెల 31వ తేది నడుపనున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది. 11 రోజుల పర్యాటక రైలు కోయంబత్తూర్‌లో బయల్దేరి చెంగోట్టై, తెన్‌కాశి, రాజపాళయం, విరుదునగర్, మదురై, దిండుగల్, తిరుచ్చి, విరుదాచలం, విల్లుపురం, చెన్నై మీదుగా వెళుతుంది. ఈ యాత్రలో పూరి జగన్నాథ్, కోణార్క్ సూర్య దేవాలయం, భువనేశ్వర్ లింగరాజ్, కోల్‌కతా కాళి, దక్షిణేశ్వర్, అయోధ్యలోని బాల రామాలయాలను సందర్శించవచ్చు. నాన్ ఏసీ కోచ్‌లో ఒకరికి రూ.23,750 ఛార్జీగా నిర్ణయించారు. ఇతర వివరాలకు 7305858585 అనే నెంబరు సంప్రదించవచ్చు.

ఎక్స్‌ప్రెస్ రైళ్ల పొడిగింపు

పెరంబూర్, మార్చి 5: పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను పొడిగిస్తూ దక్షిణ రైల్వే మంగళవారం ప్రకటన విడుదల చేసింది. ● నెం.09419 అహమ్మదాబాద్-తిరుచ్చి ప్రత్యేక వారాంతపు ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 7,14,21,28 తేదీలు, అలాగే, నెం.09420 తిరుచ్చి-అహమ్మదాబాద్ ప్రత్యేక వారాంతపు ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 10,17,24,31 తేదీలకు పొడిగించారు. ● నెం.09520 ఓఖా-మదురై వారాంతపు ప్రత్యేక రైలు ఈ నెల 11,18,25 తేదీలు, అలాగే, నెం.09519 మదురై-ఓఖా వారాంతపు ప్రత్యేక రైలు ఈ నెల 8,15,22,29 తేదీలకు పొడిగించినట్లు, ఈ రైళ్ల రిజర్వేషన్ బుధవారం నుంచి ప్రారంభమవుతుందని దక్షిణ రైల్వే తెలియజేసింది.

7న పార్టీ నిర్వాహకులతో కమల్ సమావేశం

అడయార్, మార్చి 5: వచ్చే లోక్‌సభ ఎన్నికల కోసం మక్కల్ నీది మయ్యం పార్టీ నేతలు, కార్యకర్తలను సమాయత్తం చేసే చర్యల్లో భాగంగా ఈ నెల 7న పార్టీ నిర్వాహకులతో ఆ పార్టీ అధ్యక్షుడు, సినీ నటుడు కమల్ హాసన్ కీలక సమావేశం నిర్వహించనున్నారు. ఆళ్వార్‌పేటలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగే సమావేశంలో ఎన్నికలకు సంబంధించి కమల్ కీలక నిర్ణయాలు ప్రకటించే అవకాశమున్నట్టు తెలుస్తుంది.

రేపటి నుంచి 770 ప్రత్యేక బస్సులు

ప్యారీస్, మార్చి 5: మహాశివరాత్రి, వారాంతపు సెలవులను పురస్కరించుకొని 770 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. కిలాంబాక్కం బస్ టెర్మినల్ నుంచి తిరువణ్ణామలై, తిరుప్పూర్, కోయంబత్తూర్, సేలం, దక్షిణ జిల్లాలకు 7వ తేది 270 బస్సులు, 8న 390 బస్సులు, 0వ తేది 430 బస్సులు నడుపనున్నారు. అలాగే, 10వ తేది పలు ప్రాంతాల నుంచి చెన్నైకు ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు రవాణా శాఖ అధికారులు తెలిపారు.

ఆలస్యంగా సబర్బన్ రైళ్లు

● ప్రయాణికుల రైల్‌రోకో


రైల్ రోకో చేపట్టిన ప్రయాణికులు

పెరంబూర్, మార్చి 5: కాంచీపురం-చెన్నై బీచ్ మధ్య నడిచే సబర్బన్ రైళ్లు సమయానికి రావడం లేదంటూ ప్రయాణికులు రైల్‌రోకో చేపట్టారు. కాంచీపురం, పరిసర ప్రాంతాలకు చెందిన విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు, వ్యాపారులు ప్రతిరోజు తాం బరం, చెన్నై ప్రాంతాలకు వస్తుంటారు. తిరుమాల్‌పూర్ నుంచి చెన్నై బీచ్‌కు ఉదయం 6.15 గంటలకు బయల్దేరే రైలు అనుకూలంగా ఉంటూ, సమయానికి తమ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. కానీ, కొద్దిరోజులుగా ఈ రైలు ఆలస్యమవుతుండడంతో వారు సకాలానికి చేరుకోలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో, మంగళవారం సమయానికి రైలు రాకపోవడంతో ఆగ్రహం చెందిన ప్రయాణికులు రైలుపట్టాలపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. రైల్వే అధికారులు, పోలీసులు అక్కడకు చేరుకొని ప్రయాణికులతో శాంతి చర్చలు జరుపడంతో వారు ఆందోళన విరమించారు.

'వేండుం మోదీ...మీండుం మోదీ' అవగాహన వాక్‌థాన్


వాక్‌థాన్‌లో బీజేపీ మహిళా కార్యకర్తలు

పెరంబూర్, మార్చి 5: 'వేండుం మోదీ...మీండుం మోదీ (కావాలి మోదీ...మళ్లీ మోదీ) పేరుతో బీజేపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో వాక్‌థాన్ జరిగింది. తిరుప్పూర్ ఉత్తర జిల్లా బీజేపీ, భారత్ పాయినీర్ సమాఖ్య సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ఈ వాక్‌థాన్‌ను మహిళా విభాగం కార్యదర్శి మలర్‌కొడి ప్రారంభించారు. కార్పొరేషన్ కార్యాలయం నుంచి ప్రారంభమైన వాక్‌థాన్ పలు వీధులు మీదుగా సాగి రాయపురంలో ముగిసింది. మహిళా కార్యాకర్తలు 'మోదీ మళ్లీ ప్రధాని' కావాలని నినాదాలు చేస్తూ, చప్పట్లు కొడుతూ పాల్గొన్నారు.

రూ.32 లక్షలతో వ్యాయామశాల

ఐసిఎఫ్, మార్చి 5: స్థానిక కాశిమేడులో రూ.32 లక్షలతో ఆధునిక వ్యాయామశాలను ప్రారంభించారు. కాశిమేడు జీవరత్నం రోడ్డులో ఇటీవల ప్రారంభమైన జిమ్ పనులు పూర్తికావడంతో సోమవారం సాయంత్రం ప్రజల వినియోగానికి పెరంబూర్ ఎమ్మెల్యే శేఖర్, ఆర్కే నగర్ ఎమ్మెల్యే ఎబినేజర్‌లు సంయుక్తంగా జిమ్ ప్రారంభించారు.

రూ.2 కోట్లతో మల్టీ స్పెషాలిటీ భవనం

ఐసిఎఫ్, మార్చి 5: స్థానిక తిరువొత్తియూర్‌లో రూ.2 కోట్లతో మల్టీ స్పెషాలిటీ భవన నిర్మాణపనులు ప్రారంభమయ్యాయి. తిరువొత్తియూర్ కార్గిల్ నగర్‌లో ఏర్పాటుకానున్న ఈ భవన నిర్మాణానికి సోమవారం భూమి పూజ జరిగింది. ఏడాదిలోపు పనులు పూర్తిచేసి, భవనం ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు.

రూ.14 కోట్లతో దహనవాటిక

ఐసిఎఫ్, మార్చి 5: స్థానిక మింట్ సమీపంలోని మూలకొత్తళం శ్మశానంలో రూ.14 కోట్లతో ఆధునిక దహనవాటిక ఏర్పాటుచేశారు. ఇక్కడున్న దహనవాటిక శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రజల విజ్ఞప్తి మేరకు కొత్త దహనవాటిక నిర్మించేందుకు కార్పొరేషన్ చర్యలు చేపట్టింది. ఈ పనులు ఇటీవల పూర్తికావడంతో సోమవారం నుంచి కొత్త దహనవాటిక అందుబాటులోకి వచ్చిందని కార్పొరేషన్ తెలియజేసింది.

గాంగేయనల్లూర్ ఆలయంలో లక్ష దీపాల వేడుకలు


మురుగన్ ఆలయంలో లక్ష దీపాల వేడుకలు

వేలూరు, మార్చి 5: స్థానిక కాట్పాడి గాంగేయనల్లూరు కృపానంద వారియార్ నిర్మించిన సుబ్రమణ్యస్వామి ఆలయంలో మాసి నెల సందర్భంగా మంగళవారం లక్ష దీపాల వేడుకలు జరిగాయి. మహిళలు దీపాలు వెలిగించారు. అనంతరం సుబ్రమణ్యస్వామి, వల్లి, దేవసేన ఉత్సవమూర్తులను మాఢవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.

రూ.70 లక్షల ఆస్తి పన్ను బకాయిలు

● 150 దుకాణాలు, 3 భవనాలకు సీలు

పెరంబూర్, మార్చి 5: ఆస్తి పన్ను బకాయిలు చెల్లించని దుకాణాలు, భవనాలకు అధికారులు సీలు వేశారు. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) రాయపురం మండల పరిధిలోని 56,57 వార్డుల్లోని దుకాణాలు, భవనాలు సుమారు రూ.70 లక్షల మేర ఆస్తి పన్ను బకాయిలుంచాయి. ఈ విషయమై వాటి యజమానులకు కార్పొరేషన్ అధికారులు పలుమార్లు నోటీసులు అందజేసినా వారి నుంచి ఎలాంటి స్పందన రాలేదు. దీంతో, మంగళవారం ఉదయం ప్రకాశం రోడ్డులోని గోవిందరాజ్‌కు సొంతమైన మూడు దుకాణాలు, చంద్రమ్మాళ్‌కు సొంతమైన టాస్మాక్ దుకాణం భవనం, సెంట్రల్ కన్నప్పన్ మైదానంలో ఉన్న 150 దుకాణాలకు అధికారులు సీలు వేశారు.

తిరుకోవిలూర్ నియోజకవర్గం ఖాళీ

● ఎన్నికల సంఘానికి శాసనసభ కార్యదర్శి లేఖ

ప్యారీస్, మార్చి 5: తిరుకోవిలూర్ శాసనసభ స్థానం ఖాళీగా ఉన్నట్లు ఎన్నికల సంఘానికి శాసనసభ కార్యదర్శి లేఖ రాశారు. మాజీ మంత్రి పొన్ముడి ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో మూడేళ్ల జైలుశిక్ష విధించడంతో ఆయన మంత్రి, ఎమ్మెల్యే పదవులు కోల్పోయారు. దీంతో, ఆయన ప్రాతినిధ్యం వహించిన తిరుకోవిలూర్ నియోజకవర్గం ఖాళీగా ఉన్నట్లు శాసనసభ కార్యదర్శి ఎన్నికల సంఘానికి లేఖ రాశారు. దీంతో, త్వరలో జరుగనున్న పార్లమెంటు ఎన్నికలతో పాటు తిరుకోవిలూర్ ఉప ఎన్నిక జరిగే అవకాశముంది. ఇప్పటికే విలవంగోడు నియోజకవర్గం ఖాళీగా ఉన్నట్లు ఎన్నికల సంఘానికి శాసనసభ కార్యదర్శి లేఖ రాసిన విషయం తెలిసిందే. ఆ ప్రకారం, రాష్ట్రంలో రెండు శాసనసభ నియోజకవర్గాలకు ఉప ఎన్నికలు జరుగనున్నాయి.

లబ్ధిదారులకు సంక్షేమ సహాయాల పంపిణీ


లబ్ధిదారులకు సహాయాలు అందజేస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి, ఎమ్మెల్యే నందకుమార్

వేలూరు, మార్చి 5: ఆనైకట్టు డివిజన్‌లో సంక్షేమ సహాయాల పంపిణీ మంగళవారం జరిగింది. కార్యక్రమానికి కలెక్టర్ సుబ్బులక్ష్మి అధ్యక్షత వహించగా, స్థానిక ఎమ్మెల్యే నందకుమార్ పాల్గొని, 1150 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ కమిటీ అధ్యక్షుడు బాబు, యూనియన్ కమిటీ అధ్యక్షులు భాస్కరన్, అముద జ్ఞానశేఖరన్, జిల్లా రెవెన్యూ అధికారి మాలతి, వేలూరు రెవెన్యూ తహసీల్దార్ కవిత, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల ఏర్పాట్లపై సమీక్ష


ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారుల సమావేశం

వేలూరు, మార్చి 5: స్థానిక కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం 2024 పార్లమెంటు ఎన్నికల ఏర్పాట్లపై సమీ క్షా సమావేశం జరిగింది. జిల్లా ఎన్నిక ల అధికారి సుబ్బులక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఫ్లైయింగ్ స్క్వాడ్, పర్మినెంట్ చెకింగ్ కమిటీ అధికారులు పాల్గొన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి మాలతి, జిల్లా కలెక్టర్ ఎన్నికల పీఏ సెల్వరాజ్, ఉప ఎన్నికల అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

విడిది గృహాల నిర్మాణానికి భూమి పూజ


భూమిపూజలో మంత్రి గాంధీ

వేలూరు,మార్చి5:రాణిపేట డివిజన్ షోలింగర్ లక్ష్మీనరసింహస్వామి ఆలయ దిగువ ప్రాంతంలో రూ.2.46 కోట్ల దాతల సహకారంతో భక్తుల కోసం విడిది గృహాలు నిర్మించనున్నారు. ఈ గృహాల నిర్మాణాలకు సంబంధించిన భూమి పూజలో చేనేత, జౌళి శాఖ మంత్రి ఆర్.గాంధీ పాల్గొన్నారు. విరాళదాత మిరునాలి శ్రీనివాసన్, జిల్లా అరంగావలర్ ట్రస్ట్ కమిటీ అధ్యక్షుడు లక్ష్మణన్, అసిస్టెంట్ కమిషనర్ (బాధ్యత) జయ. నగర మండ్ర అధ్యక్షుడు తమిళ్‌సెల్వి అశోకన్ సహా పలువురు పాల్గొన్నారు.

కోర్టుకు హాజరైన బీజేపీ నేత హెచ్.రాజా

పెరంబూర్, మార్చి 5: మహిళలపై అసభ్య అభిప్రాయాలు వ్యక్తం చేసిన కేసులో బీజేపీ సీనియర్ నేత హెచ్.రాజా ప్రత్యేక న్యాయస్థానం ఎదుట హాజరయ్యారు. 2018లో మహిళల గురించి, ప్రజా శాంతికి భంగం కలిగించేలా హెచ్.రాజా తన 'ఎక్స్'లో వ్యాఖ్యలు పోస్ట్ చేశారని మాజీ మంత్రి ఆందియూర్ సెల్వరాజ్ ఈరోడ్ నగర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కేసు విచారణ చెన్నైలోని ప్రత్యేక న్యాయస్థానంలో జరుగుతుండగా, మంగళవారం జరిగిన విచారణకు రాజా హాజరుకాగా, తదుపరి విచారణ ఈ నెల 20వ తేదీకి వాయిదావేస్తూ న్యాయమూర్తి జయవేల్ ఉత్తర్వులు జారీచేశారు.

ప్రత్యేక చిహ్నంపైనే పోటీ

● జీకే వాసన్

పెరంబూర్, మార్చి 5: రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో ప్రత్యేక చిహ్నంపైనే పోటీ చేయనున్నామని, తమ పార్టీకి 'సైకిల్' గుర్తు కేటాయించాలని ఎన్నికల సంఘానికి లేఖ రాసినట్లు తమిళ మానిల కాంగ్రెస్ (టీఎంసీ) అధ్యక్షుడు జీకే వాసన్ తెలిపారు. బీజేపీ కూటమిలో పోటీచేస్తున్న టీఎంసీ, నాలుగు పార్లమెంటు స్థానాలు, ఒక రాజ్యసభ స్థానం కేటాయించాలని ప్రతిపాదిస్తోంది. అదే సమయంలో, ఎన్నికల్లో పార్టీ తరపున పోటీచేయాలనుకొనే వారు ఈ నెల 4 నుంచి 6వ తేది వరకు పార్టీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరింది. ఈ నేపథ్యంలో, నగరంలో మంగళవారం జీకే వాసన్ మీడియాతో మాట్లాడుతూ... రాబోయే ఎన్నికల్లో ఎన్డీఏ విజయం తథ్యమని, మూడవసారి ప్రధానిగా మోదీ అధికారం చేపట్టనున్నారని తెలిపారు.

వండలూరు పార్క్ కార్మిక సంఘం ధర్నా

పెరంబూర్, మార్చి 5: స్థానిక వండలూరు పార్క్ సమీపంలో కార్మిక సంఘాలు చేపట్టిన ఆందోళన మంగళవారం 7వ రోజు కొనసాగాయి. ఈ పార్క్‌లో పనిచేస్తున్న కొందరు కార్మికులు సంఘం ఏర్పాటుచేసుకున్నారు. పార్క్ సమీపంలో కార్మిక సంఘం బోర్డు, పతాకావిష్కరణ గత 26వ తేది జరిగింది. ఈ నేపథ్యంలో, రాత్రికి రాత్రే పార్క్ యజమాన్యం బోర్డు, పతాక స్తంభం తొలగించినట్లు సమాచారం. ఈ చర్యలను ఖండిస్తూ ఆ కార్మిక సంఘం ఆధ్వరంలో ధర్నా చేపట్టారు. ధర్నా చేపట్టిన కార్మిక సంఘాల నేతలతో పార్క్ యజమాన్యం చర్చలు జరుపుతోంది.

పుదుచ్చేరి మంత్రిగా తిరుమురుగన్

పుదుచ్చేరి, మార్చి 5: కేంద్రపాలిత రాష్ట్రం పుదుచ్చేరి కొత్త మంత్రిగా తిరుమురుగన్ పేరును రాష్ట్రపతి ఆమోదించారు. పుదుచ్చేరిలో ముఖ్యమంత్రి రంగస్వామి నేతృత్వంలో ఎన్నార్ కాంగ్రెస్-బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం అధికారంలో ఉంది. ఈ నేపథ్యంలో, రవాణా శాఖ మంత్రిగా వ్యవహరించిన నెడుంగాడు (రిజర్వ్‌డ్) ఎమ్మెల్యే చంద్రప్రియాంక గత ఏడాది అక్టోబరు 10వ తేది తన పదవికి రాజీనామా చేశారు. ఆమె స్థానంలో కారైకాల్ ఉత్తరం ఎమ్మెల్యే తిరుమురుగన్, డిప్యూటీ స్పీకర్ రాజవేలు పేర్లను సూచిస్తూ రాష్ట్రప్రభుత్వం రాష్ట్రపతికి సిఫారసు చేసింది. వీరిలో తిరుమురుగన్‌ను కొత్త మంత్రిగా ఆమోదిస్తూ రాష్ట్రపతి ఉత్తర్వులు జారీచేసినట్లు కేంద్ర హోంశాఖ డిప్యూటీ కార్యదర్శి అసుతోష్‌అగ్నిహోత్రి ప్రకటన విడుదల చేశారు. తిరుమురుగన్ త్వరలో మంత్రిగా పదవీ ప్రమాణం చేయనున్నట్లు ప్రభుత్వ వర్గాల సమాచారం.

మంత్రి ఉదయనిధికి బెంగళూరు కోర్టు సమన్లు



పెరంబూర్, మార్చి 5: సనాతన ధర్మంపై మంత్రి ఉదయనిధి వ్యాఖ్యలను ఖండిస్తూ, కర్ణాటక రాష్ట్రం బెంగుళూరుకు చెందిన పరమేశ్ 42వ అదనపు ప్రిన్సిపల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ గత ఫిబ్రవరి 2వ తేది విచారణకు రాగా ఈ నెల 4వ తేది కోర్టుకు హాజరుకావాలని ఉదయనిధికి సమన్లు జారీ చేసింది. ఈ కేసు సోమవారం న్యాయమూర్తి జె.ప్రీత్ సమక్షంలో విచారణకు వచ్చింది. కానీ, విచారణకు మంత్రి ఉదయనిధి హాజరుకాలేదు. సమన్లు తీసుకున్నట్లు చేసిన సంతకం మంత్రి ఉదయనిధి అవునా? కాదా? అనే విషయం తెలియలేదని, అందువల్ల ఏప్రిల్ 26వ తేది విచారణకు హాజరుకావాలని న్యాయమూర్తి రెండవ సారి సమన్లు జారీచేశారు. ఈ సారి, చెన్నైలో ఉన్న ఎస్పీ స్థాయి అధికారి నేరుగా ఉదయనిధి సమన్లు అందజేయాలని న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు.

వెయ్యి లంచం ఆశించిన వీఏవో అరెస్టు

పెరంబూర్, మార్చి 5: తిరుచ్చి సమీపంలో పట్టా మార్పిడికి రూ.1,000 లంచం తీసుకున్న గ్రామ నిర్వహణ అధికారి (వీఏఓ) కటకటాల పాలయ్యాడు. సిద్ధాంత ప్రాంతానికి చెందిన గాంధీమతి పట్టా మార్పిడి కోసం వీఏఓ శివసెల్వకుమార్‌ను సంప్రదించగా, ఆయన రూ.1,000 డిమాండ్ చేశారు. లంచం ఇచ్చేందుకు ఇష్టపడని గాంధీమతి ఏసీబీ అధికారులను ఆశ్రయించింది. అధికారుల సూచనల మేరకు మంగళవారం ఉదయం శివసెల్వకుమార్‌కు గాంధీమతి రూ.1,000 అందజేస్తుండగా, అక్కడే మాటువేసిన అధికారులు, వీఏఓను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని అరెస్ట్ చేశారు.

92 పశువుల స్వాధీనం

ఐసిఎఫ్, మార్చి 5: రోడ్లపై సంచరించిన 92 పశువులను స్వాధీనం చేసుకొని వాటి యజమానులకు రూ.1.84 లక్షల జరిమానా విధించినట్లు తాంబరం కార్పొరేషన్ తెలిపింది. రహదారుల్లో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగించేలా సంచరించే పశువులను బంధించి వాటి సంరక్షకులకు అధికారులు జరిమానా విధిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో, గత ఫిబ్రవరి 5 నుంచి ఈ నెల 1వ తేది వరకు రోడ్లపై సంచరించిన 92 పశువులను బంధించి వాటి యజమానులకు రూ.1,84,000 జరిమానా విధించినట్లు అధికారులు తెలిపారు.

ఖైదీకి గంజాయి.. ఇద్దరి అరెస్టు

పెరంబూర్, మార్చి 5: స్థానిక పుళల్ జైలులో ఖైదీకి గంజాయి ఇచ్చిన ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ జైలులో బందీగా ఉన్న మన్నివాక్కంకు చెందిన హేమచంద్రన్ ను పరామర్శించేందుకు అతడి స్నేహితులు ముడిచూర్‌కు చెందిన విజయరాఘవన్, సంతోష్ సోమవారం జైలుకు వచ్చారు. వారు హేమచంద్రన్‌కు అందజేసిన తినుబండారాలు, జీన్స్ ప్యాంట్, టీ షర్ట్‌ను జైలు సిబ్బంది తనిఖీ చేయగా, జీన్స్ ప్యాంట్‌లో 5 గ్రాముల గంజాయి గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంపై జైలు అధికారుల ఫిర్యాదుతో పుళల్ పోలీసులు కేసు నమోదుచేసి విజయరాఘవన్, సంతోష్‌లను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

విద్యార్థినికి లైంగిక వేధింపులు

● టీచర్లను డిస్మిస్ చేయాలంటూ ఆందోళన

పెరంబూర్, మార్చి 5: స్థానిక గుడువాంజేరి సమీపంలోని ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఇద్దరు టీచర్లను డిస్మిస్ చేయాలంటూ తల్లిదండ్రులు, బంధువులు ఆందోళన చేపట్టడం కలకలం రేపింది. ఆ పాఠశాల వార్షికోత్సవం గత నెల 23వ తేది జరిగింది. ఆ సమయంలో యూకేజీ చదువుతున్న 5 ఏళ్ల బాలికను ఇద్దరు ఉపాధ్యాయులు గదిలోకి తీసుకెళ్లి లైంగిక వేధింపులకు పాల్పడినట్లు సమాచారం. ఈ విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు గుడువాంజేరి మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై ఇన్‌స్పెక్టర్ మాలిని విచారించి, పాఠశాలలో మ్యూజిక్ టీచర్‌గా పనిచేస్తున్న నీలమంగళానికి చెందిన కాయేష్‌కుమార్ (40), తిరునల్వేలికి చెందిన రాసయ్య (29) అనే ఇద్దరు ఉపాధ్యాయులను సోమవారం రాత్రి పోక్సో చట్టం కింద అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు. ఈ వ్యవహారంలో మరెవరైనా చిన్నారులు బాధపడ్డారా? అనే కోణంగా పోలీసులు విచారణ చేపట్టారు. కాగా పాఠశాల యజమాన్యం తీరును ఖండిస్తూ మంగళవారం ఉదయం సుమారు 500 మంది పాఠశాలను ముట్టడించి ఆందోళన చేపట్టారు. పోలీసులు, పాఠశాల యజమాన్యం వారితో చర్చలు జరిపి, ఉపాధ్యాయులపై తగిన చర్యలు చేపడతామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

కోర్టుకు హాజరైన మాజీ మంత్రి సీవీ షణ్ముగం

పెరంబూర్, మార్చి 5: రాష్ట్ర ముఖ్యమంత్రి, ప్రభుత్వాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన కేసులో అన్నాడీఎంకేకు చెందిన మాజీ మంత్రి, రాజ్యసభ సభ్యుడు సీవీ షణ్ముగం మంగళవారం విల్లుపురం కోర్టులో హాజరయ్యారు. 2023 జూలై 20వ తేది విల్లుపురం పాత బస్టాండ్ సమీపంలో జరిగిన బహిరంగసభలో సీఎంను, ప్రభుత్వాన్ని కించపరిచేలా సీవీ షణ్ముగం మాట్లాడారని ప్రభుత్వ న్యాయవాది సుబ్రమణ్యన్ చేసిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదుచేశారు. ఈ కేసు విచారణకు ఈ నెల 5వ తేది హాజరుకావాలని సీవీ షణ్ముగంకు సమన్లు జారీ చేయడంతో ఆయన మంగళవారం కోర్టుకు హాజరయ్యారు. ఆ సమయంలో షణ్ముగం తరపున న్యాయవాది... త్వరలో జరుగనున్న పార్లమెంటు ఎన్నికలను పరిగణలోకి తీసుకొని కేసు విచారణ మూడు నెలలకు వాయిదావేయాలని కోరారు. అభ్యర్థన పిటిషన్‌గా దాఖలుచేయాలని సూచించిన న్యాయమూర్తి పూర్ణిమ తదుపరి విచారణ ఈ నెల 19వ తేదీకి వాయిదావేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

జెండా స్తంభాల తొలగింపునకు ఎందుకు సహకరించడం లేదు?

● ప్రశ్నించిన హైకోర్టు

అడయార్, మార్చి 5: రాష్ట్రంలోని జాతీయ రహదారుల వెంబడివున్న రాజకీయ పార్టీల జెండా స్తంభాలను తొలగించే విషయంపై నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) అధికారులు ఎందుకు సహకరించడం లేదని మద్రాస్ హైకోర్టు ప్రశ్నించింది. అంతేకాకుండా, ఈ అంశంపై కౌంటర్ దాఖలు చేయాని సర్కారుకు నోటీసు జారీచేసింది. రాష్ట్రంలో జాతీయ రహదారుల వెంబడి వున్న పార్టీ జెండా స్తంభాలను తొలగించాలని కోరుతూ చెన్నై నగరానికి చెందిన న్యాయవాది రామలింగం హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై విచారణ సందర్భంగా ఎన్‌హెచ్ఏఐ తరపున హాజరైన న్యాయవాది.. ఈ జెండా స్తంభాల తొలగింపునకు ప్రభుత్వం సహకరించడం లేదని కోర్టు దృష్టికి తీసుకెళ్ళారు. దీంతో ఆగ్రహించిన హైకోర్టు... ఈ అంశంలో ఎందుకు సహకరించడం లేదో తెలుపుతూ కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ, తదుపరి విచారణను ఈ నెల 11వ తేదీకి వాయిదా వేసింది.

ఆటోలో మద్యం బాటిళ్లు తరలిస్తున్న ముగ్గురు మహిళల అరెస్టు



ప్యారీస్, మార్చి 5: కారైకాల్ నుంచి నాగపట్టణానికి ఆటోలో మద్యం అక్రమంగా తరలిస్తున్నట్లు ప్రత్యేక విభాగం పోలీసులకు సోమవారం రాత్రి సమాచారం అందింది. దీంతో, నాగూర్ కొత్త బస్టాండ్ సమీపంలో పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటువైపు వచ్చిన ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురు మహిళలను పోలీసులు విచారించారు. వారు నాగపట్టణం మరుందుకొత్తలం వీధికి చెందిన దీప (34), ముత్తులక్ష్మి (40), అదృష్టకుమారి (49)లుగా గుర్తించి, ఆటోలో తరలిస్తున్న 110 మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని, వారి అరెస్ట్ చేశారు.

మెడికల్ షాపుల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి

ప్యారీస్, మార్చి 5: జిల్లాలోని అన్ని మెడికల్ షాపుల్లో నెల రోజుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలని చెన్నై జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. సీసీ కెమెరాలు ఏర్పాటుచేయని దుకాణాలపై చట్టపరమైన చర్యలు చేపడతామని హెచ్చరించారు. ముఖ్యంగా, ఎక్స్, హెచ్, హెచ్1, నిర్దేశిత డ్రగ్స్ మందులు విక్రయించే దుకాణాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి అని, తనిఖీల సమయంలో కెమెరాలు ఏర్పాటుచేయని, కెమెరాలు పనిచేయకపోవడంత తదితరాలు గుర్తిస్తే సదరు దుకాణ యజమానులపై చర్యలు చేపడతామని కలెక్టర్ హెచ్చరించారు.

పళని పర్వతమార్గంలో పంచామృతం విక్రయాల నిషేధం

● హైకోర్టు మదురై బెంచ్ ఉత్తర్వు

చెన్నై, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పళని పర్వత మార్గంలోని ఆక్రమణలకు గురైన ప్రాంతాల్లో పంచామృతం విక్రయాలపై నిషేధం విధిస్తూ హైకోర్టు మధురై డివిజన్ బెంచ్ ఆదేశాలు జారీ చేసింది. పళని పర్వతమార్గంలో ఆక్రమణలు తొలగించాలని కోరుతూ తిరుతొండర్‌సభై వ్యవస్థాపకుడు రాధాకృష్ణన్ 2018లో మదురై హైకోర్టు డివిజన్ బెంచ్‌లో పిటిషన్ వేశారు. ఆ పిటిషన్‌లో పళని పర్వత గిరి ప్రదక్షిణ మార్గంలో పలు ప్రాంతాలు ఆక్రమణకు గురయ్యాయని, దీంతో భక్తులకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందని,ఆక్రమణలను తొలగించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోని ప్రభుత్వ అధికారులపై కోర్టు ఉత్తర్వుల ఉల్లంఘన కేసు నమోదు చేయాలన్నారు. ఈ పిటిషన్‌పై ఇదివరకే విచారణ జరుపుతున్న హైకోర్టు ఈ విషయమై పరిశీలన జరిపేందుకు రిటైర్డ్ జడ్జి భారతిదాసన్ నాయకత్వంలో ఓ కమిటీ ఏర్పాటు చేసింది. ఆ తర్వాత పళని పర్వత మార్గంలో ఆక్రమలను తొలగించాలని, గిరి ప్రదక్షిణ మార్గంలో ప్రైవేటు వాహనాల సంచారంపై నిషేధం విధించాలని, భక్తులకు బ్యాటరీ కారు సేవలందించాలని, టూరిస్టు వాహనాలకు ప్రత్యేక స్థలాన్ని కేటాయించాలని హైకోర్టు ఉత్తర్వులిచ్చింది. ఈ నేపథ్యంలో ఈ పిటిషన్ న్యాయమూర్తులు కృష్ణకుమార్, విజయకుమార్‌తో కూడిన ధర్మాసనం ఎదుట మళ్ళీ విచారణకు వచ్చింది. ఆలయం తరఫున హాజరైన న్యాయవాది తన వాదనలు వినిపిస్తూ గిరి ప్రదక్షిణ మార్గంలో 80కి పైగా దుకాణాలు తొలగించారని, 143 భూకబ్జాలను గుర్తించినట్టు తెలిపారు. వాటిలో వాణిజ్య, నివాసపరమైన క్వార్టర్స్‌లో సక్రమంగా అద్దె చెల్లించనివారిని గుర్తించి వారికి నోటీసులు జారీ చేసి తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆ సందర్భంగా న్యాయమూర్తులు జోక్యం చేసుకుని గిరి ప్రదక్షిణ మార్గంలో పంచామృతాల విక్రయంపై నిషేధం విధిస్తున్నట్లు తెలిపారు. ఆక్రమణలు తొలగించేందుకు అదనపు పోలీసు భద్రత కల్పించాలని ప్రభుత్వానికి ఉత్తర్వు జారీ చేశారు.



8న హన్సిక నటించిన 'గార్డియన్' రిలీజ్

ప్రముఖ నటి హన్సిక మొత్వాని ప్రధాన పాత్రలో నటించిన 'గార్డియన్' చిత్రం ఈ నెల 8వ తేదీ ప్రేక్షకుల ముందుకురానుంది. హన్సికతో పాటు సురేష్ మేనన్, శ్రీమన్, అభిషేక్, వినోద్, శ్రీరామ్ పార్థసారథి, మొట్టై రాజేంద్రన్, ప్రదీప్ రాయన్, తంగదురై తదితరులు నటించారు. గురు శరవణన్ - శబరి ద్వయం దర్శకత్వం వహించారు. శ్యామ్ సీఎస్ సంగీతం సమకూర్చారు. ఫిల్మ్ వర్క్స్ బ్యానరుపై దర్శకుడు విజయ్ చందర్ ఈ చిత్రాన్ని నిర్మించారు. గత యేడాది అక్టోబరులో విడుదలైన ఈ చిత్రం టీజర్‌కు అద్భుతమైన స్పందన వచ్చిన విషయం తెల్సిందే. ఇపుడు చిత్రం విడుదలను పురస్కరించుకుని, సోమవారం రాత్రి నగరంలో చిత్ర బృందం మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసింది.

చిత్రజ్యోతి

ఇందులో హన్సిక మాట్లాడుతూ, 'ఇది ఒక లేడీ ఓరియంటెడ్ మూవీ. ఈ నెల 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున విడుదల చేస్తున్నాం. ఈ చిత్రంలో నటించినందుకు చాలా ఆనందంగా ఉంన్నారు. సంగీత దర్శకుడు శ్యామ్ సీఎస్ మాట్లాడుతూ, 'హన్సికతో వరుసగా మూడు చిత్రాలు చేసే అవకాశం రావడం, ఈ మూడు కూడా హర్రర్ మూవీలే కావడం గమనార్హం అన్నారు. దర్శక ద్వయం గురు శరవణన్ - శబరి మాట్లాడుతూ, 'తామిద్దరం ఇలాంటి వేదిక ఎక్కడానికి ప్రధాన కారణం తమ గురువు ప్రముఖ దర్శకుడు కేఎస్ రవికుమార్. ఆయన మాకు గాడ్‌ఫాదర్. దర్శకులుగా ఆయనే మాకు తొలి అవకాశం ఇచ్చారు. ఇపుడు ఎన్ని చిత్రాలకు దర్శకత్వం వహించినప్పటికీ.. ఆయన ఇచ్చిన తొలి అవకాశాన్ని ఎన్నటికీ మరిచిపోలేం. అదేవిధంగా ఈ చిత్ర నిర్మాత విజయ్ చందర్ దర్శకుడు కూడా కావడంతో ఆయన పలు సూచనలిచ్చారని పేర్కొన్నారు.



మీడియా సమావేశంలో 'గార్డియన్' చిత్ర బృందం

'తనిఒరువన్'లో నయనతార - జయం రవి



పసంగ-2 చిత్రంలో ఓ దృశ్యం



తృతీయ బహుమతి పొందిన ప్రభ చిత్రం



నేడు ప్రభుత్వ సినీ అవార్డుల ప్రదానోత్సవం

● ఉత్తమ చిత్రంగా 'తనిఒరువన్'



ఉత్తమ నటి జ్యోతిక

రాష్ట్ర ప్రభుత్వం 2015 సంవత్సరానికి సినీ అవార్డులను ప్రకటించింది. ఈ అవార్డుల ప్రదానోత్సవం కార్యక్రమం బుధవారం సాయంత్రం ప్యారీస్‌లోని రాజా అన్నామలై మండ్రంలో జరుగనుంది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సినిమాటోగ్రఫీ, తమిళ భాషాభివృద్ధి శాఖామంత్రి స్వామినాథన్ పాల్గొని అవార్డులను అందజేయనున్నారు. ఉత్తమ చిత్రాలకు బంగారు పతకంతో పాటు ప్రశంసా పత్రాలను అందజేస్తారు. కాగా, 2015 సంవత్సరానికిగాను ప్రభుత్వం ఎంపిక చేసిన ఉత్తమ చిత్రాలు, ఉత్తమ నటీనటుల వివరాలు..

- ఉత్తమ చిత్రం : తనిఒరువన్ (మొదటి బహుమతి)
- ఉత్తమ చిత్రం : పసంగ -2 (రెండో బహుమతి)
- ఉత్తమ చిత్రం : ప్రభ (మూడో బహుమతి)
- ఉత్తమ చిత్రం స్పెషల్ అవార్డు : ఇరుదిచుట్రు
- ఉత్తమ మహిళా చిత్రం : 36 వయదినిలే
- ఉత్తమ నటుడు : ఆర్.మాధవన్ (ఇరుదిచుట్రు)
- ఉత్తమ నటి : జ్యోతిక (36 వయదినిలే)
- ఉత్తమ నటుడు స్పెషల్ అవార్డు : గౌతం కార్తీక్ (ఇరుదిచుట్రు)
- ఉత్తమ ప్రతి నాయకుడు : అరవింద్ స్వామి (తనిఒరువన్)
- ఉత్తమ హాస్య నటుడు : సింగంపులి (అంజిక్కు ఒంద్రు)
- ఉత్తమ హాస్య నటి : దేవదర్శిని (తిరుట్టుకళ్యాణం)
- ఉత్తమ క్యారెక్టర్ ఆర్టిస్ట్ : తలైవాసల్ విజయ్ (అపూర్వమహాన్)
- ఉత్తమ క్యారెక్టర్ నటి : గౌతమి (పాపనాశం)
- ఉత్తమ దర్శకుడు : సుధా కొంగర (ఇరుదిచుట్రు)
- ఉత్తమ కథా రచయిత : మోహన్ రాజా (తనిఒరువన్)
- ఉత్తమ సంగీత దర్శకుడు : జిబ్రాన్ (ఉత్తమ విలన్)
- ఉత్తమ గేయరచయిత : వివేక్ (36 వయదినిలే)
- ఉత్తమ నేపథ్యగాయకుడు : 'గానా' బాలా (వై రాజా వై)
- ఉత్తమ నేపథ్యగాయని : కల్పనా రాఘవేంద్ర (36 వయదినిలే)
- ఉత్తమ సినిమాటోగ్రాఫర్ : రాంజీ (తనిఒరువన్)
- ఉత్తమ కళా దర్శకుడు : ప్రభాకరన్ (పసంగ-2),
- ఉత్తమ నృత్య దర్శకురాలు : బృందా (తనిఒరువన్)

ప్రజా సేవకు అంకితమైన మహనీయులు

● లయన్స్ క్లబ్ నిర్వాహకులకు విశాల్ ప్రశంస



లయన్స్ క్లబ్ నిర్వాహకులపై హీరో విశాల్ ప్రశంసల వర్షం కురిపించారు. ప్రజా సేవకు అంకితమైన మహనీయులు అంటూ కొనియాడారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగే వివిధ వైద్య సేవలు ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి చేరాలని, ఇందుకోసం తన వంతు సాయం చేస్తానని ప్రకటించారు. అన్నా నగర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివేకానంద డయాగ్నోస్టిక్ సెంటర్‌లో పేదలకు అతి తక్కువ ధరకే వివిధ రకాల వైద్య పరీక్షలను నిర్వహిస్తున్నారు. ఈ సెంటర్ 26వ వార్షికోత్సవ వేడుకలు తాజాగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విశాల్ ఈ కేంద్రంలో పనిచేసే వైద్య సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అనేక రకాలైన వైద్య సేవలు ప్రజలకు అందిస్తుంది. ముఖ్యంగా పది రూపాయలకే అన్ని రకాల రక్తపరీక్షలు చేయడం అనేది గొప్ప విషయం. ఈ విషయం ప్రతి ఒక్కరి చెంతకు చేరవేయాలి. ఇందుకోసం తన వంతు ప్రచారం చేస్తాను. వైద్యులకు విదేశాల్లో వైద్య వృత్తి చేసే అవకాశం రావొచ్చు. కానీ.. మనం చేసిన మంచి పనులే స్థిరస్థాయిగా నిలిచిపోవడంతో పాటు ఆత్మసంతృప్తినిస్తాయి' అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అన్నా నగర్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

కె.భాగ్యరాజ్ కలెక్టరుగా నటించిన 'ఆండవన్'



ఆండవన్'లో ఓ దృశ్యం

సీనియర్ నటుడు, దర్శక నిర్మాత కె.భాగ్యరాజ్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన చిత్రం 'ఆండవన్'. ఇందులో కలెక్టర్ పాత్ర పోషించారు. విలియమ్స్ బ్రదర్స్ ప్రొడక్షన్స్ పతాకంపై తెరకెక్కింది. డిజిటల్ విజయ్ యూ ట్యూబర్ మహేష్, వైష్ణవి జంటగా నటించగా, గంజా కరుప్పు, ముత్తుకలై, అధీర, హలో కందస్వామి, ఎంకేఆర్ ముత్తు సెల్వం తదితరులు ఇతర పాత్రలు పోషించారు. వి.విల్లితిరుకణ్ణన్ ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే, మాటలు సమకూర్చి దర్శకత్వం వహించారు. ఈ సినిమా వివరాలను దర్శకుడు వివరిస్తూ, 'దేశంలో పట్టణీకరణ కారణంగా గ్రామాలు అంతరించిపోతున్నాయి. ఈ గ్రామాలే జీవనాధారం. ఆపదలో ఉన్నపుడు ఎవరైన సాయం చేస్తే ఆ వ్యక్తిని దేవుడితో సమానంగా చూస్తాం. ఇందులో కలెక్టరుగా భాగ్యరాజ్ నటించారు. ఆయన ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటారు. అది ఏంటి? ఆయన గ్రామవాసులకు దేవుడు ఎలా అయ్యారన్నదే ఈ చిత్ర కథ' అని ఆయన పేర్కొన్నారు.

వీఐటీ చెన్నై క్యాంపస్‌లో హంగామా!

నేటినుంచి అట్టహాసంగా 'వైబ్రెన్స్- 2024'

● 200 సాంస్కృతిక పోటీలు
● 40 రకాల క్రీడా పోటీలు ● క్యాంపస్ ఉపాధ్యక్షుడు శేఖర్ విశ్వనాధన్ ప్రకటన

చెన్నై, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వండలూరు సమీపంలోని వీఐటీ చెన్నై క్యాంపస్‌లో వైబ్రెన్స్ -2024 అంతర్జాతీయస్థాయి సాంస్కృతిక క్రీడా పోటీలు బుధవారం అట్టహాసంగా ప్రారంభమవుతున్నాయని ఆ క్యాంపస్ ఉపాధ్యక్షుడు శేఖర్ విశ్వనాధన్ తెలిపారు. నగరంలోని స్టార్‌హోటల్‌లో మంగళవారం మధ్యాహ్నం ఏర్పాటైన ప్రత్యేక కార్యక్రమంలో వైబ్రెన్స్-2024 లోగో, జెర్సీలను ఆయన ఆవిష్కరించారు. ఆ సందర్భంగా మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ పోటీలలో సుప్రసిద్ధ నేపథ్య గాయని శ్రేయా ఘోషల్, ప్రముఖ నటి, గాయని ఆండ్రియా, నేపథ్య గాయని, జోనితా గాంధీ, ప్రముఖ క్రికెటర్ దినేష్ కార్తీక్, ప్రముఖ నటుడు, సంఘసేవకుడు సోనూ సూద్, డీజేలు తనికా తదితరులు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారని తెలిపారు. జాతీయ స్థాయిలో అతి పెద్ద కళాత్మక సాంస్కృతిక, క్రీడా ఉత్సవాలను ప్రతియేటా వైబ్రెన్స్ పేరుతో నిర్వహిస్తున్నామని, ఈ యేడాదికి వీఐటీ చెన్నై క్యాంపస్‌లో ఈ నెల 6 నుంచి 9వతేదీ వరకు ఈ వేడుకలను జరుపుతున్నామని ఆయన వివరించారు. ఈ వేడుకలలో ఐఐటీ, ఎన్ఐటీ, అన్నా విశ్వవిద్యాలయం సహా సుప్రసిద్ధ విశ్వవిద్యాలయాల నుంచి, జపాన్, బ్రెజిల్, శ్రీలంక, మయన్మార్, ఎథియోపియా, వియత్నాం, కంబోడియా, మలేసియా, ఇండోనేషియా, పోలండ్, ఫిలిఫ్ఫైన్స్ వంటి దేశాల నుంచి 22 వేల మందికిపైగా హాజరకానున్నారని చెప్పారు. 200 రకాల సాంస్కృతిక పోటీలు, క్రికెట్, హాకీ వంటి 40 రకాల క్రీడా పోటీలు సహా మొత్తం 250 రకాల పోటీలు అలరించనున్నాయని తెలిపారు. ఈ పోటీల విజేతలకు రూ.10లక్షలకు పైగా బహుమతులను అందజేస్తామన్నారు. బుధవారం ఉదయం ఈ పోటీలను ప్రముఖ క్రికెటర్ దినేష్ కార్తీక్ ప్రారంభిస్తారని, సాయంత్రం శ్రేయా ఘోషల్ సంగీత విభావరి జరుగుతుందని తెలిపారు. గురువారం సాయంత్రం నటి, గాయని ఆండ్రియా సంగీత కచేరీ, శుక్రవారం గాయని జోనితాగాంధీ సంగీత కచేరి నిర్వహిస్తారని, శనివారం ముగింపు వేడుకలలో బాలీవుడ్ నటుడు సోనూ సూద్ పాల్గొంటారని చెప్పారు. విలేఖరుల సమావేశంలో అడిషనల్ రిజిస్ట్రార్ మనోహరన్, విద్యార్థుల సంక్షేమ సంస్థ సంచాలకుడు రాజశేఖర్, వైబ్రెన్స్ 2024 కన్వీనర్ సత్యనారాయణ, కో-కన్వీనర్ బాలా తదితరులు పాల్గొన్నారు.



జెర్సీలను ఆవిష్కరిస్తున్న వీఐటీ ఉపాధ్యక్షుడు శేఖర్ విశ్వనాధన్, రిజిస్ట్రార్ మనోహరన్ తదితరులు

రెండో దశ మెట్రో ప్రాజెక్టు కోసం మరో 32 డ్రైవర్ రహిత రైళ్ల కొనుగోలు

పెరంబూర్, మార్చి 5: నగరంలో రెండో దశ మెట్రోరైలు ప్రాజెక్టు కోసం మరో 32 డ్రైవర్ రహిత రైళ్లను కొనుగోలు చేయడానికి చెన్నై మెట్రోరైలు లిమిటెడ్‌సంస్థ (సీఎంఆర్ఎల్) నిర్ణయించింది. ఆ మేరకు టెండర్లు జారీ చేయడానికి చర్యలు చేపడుతోంది. రెండో దశ మెట్రోరైలు ప్రాజెక్టులో మూడు మార్గాల్లో 116.1 కి.మీ మేర మెట్రోరైలు మార్గ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మాధవరం-సిరుచేరి సిప్కాట్ (45.4 కి.మీ), లైట్‌హౌస్-పూందమల్లి (26.1 కి.మీ), మాధవరం-షోలింగనల్లూర్ (44.6 కి.మీ) తదితర మార్గాల్లో రెండో దశ మెట్రోరైలు మార్గ నిర్మాణ పథకాలు చేపట్టనుండగా, ఆ మార్గాలలో మొత్తం 119 రైల్వేస్టేషన్లు ఏర్పాటుకానున్నాయి. ఈ ప్రాజెక్ట్ కోసం డ్రైవర్ రహిత మూడు బోగీలతో కూడిన 36 మెట్రోరైళ్ల కొనుగోలుకు ఆల్‌స్టోమ్ ట్రాన్స్‌పోర్ట్ ఇండియా సంస్థతో రూ.1,215.92 కోట్ల మేరకు ఒప్పందాలు సీఎంఆర్ఎల్ కుదుర్చుకుంది. ఈ నేపథ్యంలో, మరో 32 రైళ్ల కొనుగోలుకు తాజాగా సీఎంఆర్ఎల్ టెండర్లు ఆహ్వానించింది. కాగా, తొలుత మూలధన వ్యయం తగ్గించుకొనేలా కొన్ని మెట్రోరైళ్లను అద్దెకు తీసుకోవాలని భావించగా, ప్రస్తుతం ఆ ప్రాజెక్ట్‌లో మార్పులు చేసినట్లు సీఎంఆర్ఎల్ అధికారులు తెలిపారు.

క్విజ్ బైట్స్ 2.0 పోటీలు..

● విజేతలకు సర్టిఫికెట్ల ప్రదానం



విజేతలు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న చెఫ్ దామోదరన్ తదితరులు

అడయార్, మార్చి 5: క్విజ్ బైట్స్ 2.0 పేరుతో చెఫ్‌ల కోసం ప్రత్యేకంగా నిర్వహించిన పోటీల్లో టైటిల్ విజేతలుగా రిషిత, అనూష ఎంపికయ్యారు. వీరికి ఎస్ఐసీఏ ప్రెసిడెంట్, ప్రముఖ చెఫ్ దామోదరన్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలతోపాటు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. సౌత్ ఇండియన్ కలినరీ అసోసియేషన్ సహకారంతో నుంగంబాక్కంలోని ఇస్పానీ సెంటర్‌లో ఈ పోటీలను నిర్వహించారు. ఇందులో పలువురు పాకశాస్త్ర నిపుణులు పాల్గొని తమ ప్రతిభ కనబరిచారు. దక్షిణ భారతదేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పాకశాస్త్ర నిపుణుల్లో తిరుపతికి చెందిన ఐసీఐ బీబీఏ రిషిత, అనుష విజేతలుగా నిలిచారు. రెండో అవార్డును హైదరాబాద్‌కు చెందిన కలినరీ అకాడెమీ, మూడో అవార్డును తిరుపతి ఐసీఐ ఎంబీఏ సంస్థలకు చెందిన పాకశాస్త్ర నిపుణులు సొంతం చేసుకున్నారు.

గ్రీన్ మిషన్ తమిళనాడుకు చైల్డ్ అంబాసిడర్ డీజే ఆదవి



గ్రీన్ మిషన్ తమిళనాడు చైల్డ్ అంబాసిడర్ డీజే ఆదవి తదితరులు

అడయార్, మార్చి 5: వరల్డ్ ఫస్ట్ కార్బన్ న్యూట్రల్ బేబీ ఆదవిని గ్రీన్ మిషన్ తమిళనాడుకు చైల్డ్ అంబాసిడర్‌గా నియమించారు. స్థానిక కొరటూరులోని బంగా హోటల్ అండ్ రిసార్ట్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో 11 నెలల 16 రోజుల వయసున్న ఈ కార్బన్ న్యూట్రల్ బేబీని అంబాసిడర్‌గా ఎంపిక చేశారు. ఈ విషయాన్ని తమిళనాడు గ్రీన్ ప్రాజెక్టు చీఫ్ ప్రాజెక్టు డైరెక్టర్ దీపక్ శ్రీవాస్తవ అధికారికంగా వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వాతావరణ మార్పులను ఎదుర్కొనే విషయంలో సమిష్టి చర్యలకు అధిక ప్రాధాన్యమివ్వాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సుస్థిరత, కార్బన్ న్యూట్రల్, స్థిరమైన భవిష్యత్ సృష్టించడంలో వ్యక్తులు, సంస్థల పాత్రపై విపులంగా చర్చించారు. కావేరీ హాస్పిటల్, గ్రీన్ తమిళనాడు, కౌన్సిల్ ఫర్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్, బియాండ్ సస్టైనబులిటీ ఆర్గనైజేషన్‌లు పర్యావరణ పరిరక్షణ కోసం 'నోవా' పేరుతో ప్రారంభించిన పథకాన్ని ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించాయి.

అన్నాడీఎంకే కూటమిలో పుదియ తమిళగం



పుదియ తమిళగం నేత డాక్టర్ కృష్ణసామిని శాలువతో సత్కరిస్తున్న అన్నాడీఎంకే నాయకులు

అడయార్, మార్చి 5: అన్నాడీఎంకే కూటమిలో పుదియ తమిళగం పార్టీ చేరిందని ఆ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కె.కృష్ణస్వామి తెలిపారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సీట్ల కేటాయింపు అంశంపై ఆయన అన్నాడీఎంకే నేతలతో సంప్రదిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ, తాము అన్నాడీఎంకే కూటమిలో చేరామని, ఇరు పార్టీ నేతల మధ్య జరిగిన చర్చలు సంతృప్తికరంగా ముగిశాయని చెప్పారు. తాము ఏ స్థానం నుంచి పోటీ చేస్తామనే విషయం తదుపరి దఫా చర్చల తర్వాత వెల్లడిస్తామని ఆయన పేర్కొన్నారు. ఆ తర్వాత మాజీ మంత్రి ఎస్పీ వేలుమణి మాట్లాడుతూ, రెండు పార్టీల మధ్య చర్చలు సంతృప్తికరంగా జరిగాయని, తదుపరి చర్చల్లో సీట్ల పంపిణీ జరుగుతుందన్నారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి సారథ్యంలో బలమైన కూటమి ఏర్పాటు దిశగా చర్చలు, సంప్రదింపులు జరుగుతున్నాయని ఆయన తెలిపారు.

'మిచౌంగ్' తుఫాను ఎఫెక్ట్... దెబ్బతిన్న ఇళ్ల మరమ్మతులకు రూ.45.84 కోట్లు

ప్యారీస్,మార్చి5: గత ఏడాది డిసెంబరులో సంభవించిన 'మిచౌంగ్' తుఫాను, భారీ వర్షాలు,వరదలతో దెబ్బతిన్న 955ఇళ్ల మరమ్మతులకు రూ.45.84 కోట్లు కేటాయిస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. తుఫాను ప్రభావంతో చెంగల్పట్టు, తిరువళ్లూర్, కాంచీపురం జిల్లాలు, భారీవర్షాల కారణంగా తిరునల్వేలి,తూత్తుకుడి, తెన్‌కాశి,కన్నియాకుమారి జిల్లాల్లో వరదలు సంభవించాయి.వరదల్లో చిక్కుకొని దెబ్బతిన్న ఇళ్ల మరమ్మతులకు రూ.2 లక్షలు, పూర్తిగా దెబ్బతిన్న ఇళ్ల పునర్నిర్మాణాలకు రూ.4 లక్షలు అందజేయనున్నట్లు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రకటించారు. ఆ ప్రకారం, వివిధ శాఖలు అందించిన నివేదికల ఆధారంగా దెబ్బతిన్న 577 ఇళ్ల మరమ్మతులకు రూ.21.62 కోట్లు, పూర్తిగా దెబ్బతిన్న ఇళ్ల పునర్నిర్మాణాలకు రూ.24.22 కోట్లు కేటాయిస్తూ మంగళవారం ప్రభుత్వం జీవో విడుదల చేసింది.

బ్లూస్టార్ నుంచి ప్రీమియం మోడల్ ఏసీలు

అడయార్, మార్చి 5: శీతలీకరణ వస్తు ఉత్పత్తు(ఏసీ)ల తయారీ కంపెనీల్లో ఒకటైన బ్లూస్టార్ తాజాగా ప్రీమియం మోడల్ ఎయిర్ కండీషనర్లను ప్రవేశపెట్టింది. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని బెస్ట్ ఇన్ క్లాస్ సరసమైన రేంజ్, ఫ్లాగ్‌షిప్ ప్రీమియం రేంజ్ సహా తన కొత్త సమగ్ర శ్రేణి రూమ్ ఏసీలను మార్కెట్‌లోకి తీసుకొచ్చింది. సోమవారం నగరంలో జరిగిన విలేకరుల సమావేశంలో బ్లూస్టార్ ఎండీ బి.త్యాగరాజన్, ప్రెసిడెంట్, సీవోవో శశి అరోరా మీడియాతో మాట్లాడుతూ, ఫ్లాగ్‌షిప్ ప్రీమియం రేంజ్ సహా తన కొత్త సమగ్ర శ్రేణి రూమ్ ఏసీలను ఆవిష్కరించామని, తమ కంపెనీ వందకు పైగా మోళ్ళను ఇన్వర్టర్, ఫిక్స్‌డ్ స్పీడ్, విండో ఏసీల స్పెక్ట్రమ్‌లో లాంచ్ చేసినట్టు తెలిపారు. అలాగే, ప్రతి వినియోగదారుడి సెగ్మెంట్‌కు అనుగుణంగా సరసమైన ధరలు ఉన్నాయన్నారు. ముఖ్యంగా 2024లో కొత్త శ్రేణి ఎయిర్ కండీషనర్లను ప్రవేశపెట్టామని తెలిపారు. వీటిలో టూస్టార్, త్రీస్టార్, ఫైవ్ స్టార్ వేరియంట్లలో ఫ్లాగ్ షిప్, ప్రీమియం, అఫోర్డబుల్ రేంజ్ ఉన్నట్టు వివరించారు. వీటి ప్రారంభ ధర రూ.29,990గా ఉందని, అలాగే, 0.8 టీఆర్ నుంచి 2.2 టీఆర్ వరకు వివిధ కూలింగ్ సామర్థ్యాల్లో లభిస్తాయని పేర్కొన్నారు. కొత్తగా ఆవిష్కరించిన ఈ ఏసీల్లో కస్టమర్ ఫ్రెండ్లీ ఫీచర్లున్నాయని తెలిపారు. ముఖ్యంగా ఏఐ ప్రో, ఫాస్ట్ కూలింగ్ కోసం టర్బో కూలింగ్ వంటి ఫీచర్లు ఉన్నాయని తెలిపారు. అలాగే, కంపెనీ 80వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేకంగా 80వ ప్రత్యేక ఎడిషన్ పేరుతో ఏసీని కూడా ప్రారంభించింది. ఈ మోడల్ సమగ్ర సాంకేతికతలతో పవర్ ప్యాక్‌తో రూపొందించినట్టు వెల్లడించారు. ఇది ప్రస్తుతం దేశంలో అందుబాటులో ఉన్న అత్యంత అధునాతన ఎయిర్ కండీషనర్‌గా నిలిచిందని ఆయన పేర్కొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎండీ బి.త్యాగరాజన్, శశి అరోరా తదితరులు

ఢిల్లీలో చెన్నై శిల్పకారుడికి ప్రశంసలు



కడియం శ్రీనివాస్

అడయార్, మార్చి 5: న్యూఢిల్లీలో జరిగిన భారత టెక్స్-2024 గ్లోబల్ టెక్స్ టైల్ ఎక్స్‌పోలో చెన్నైకు చెందిన ప్రముఖ ఉడ్‌కార్వింగ్ ఆర్టిస్ట్, తమిళనాడు రాష్ట్ర అవార్డు గ్రహీత కడియం శ్రీనివాస్‌కు ప్రశంసలు దక్కాయి. ఆయనకు భారత హస్తకళల అభివృద్ధి సంస్థ నుంచి ఆహ్వానం అందింది. కేంద్ర ప్రభుత్వం జౌళి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ టెక్స్‌టైల్ ఎక్స్‌పో ఢిల్లీలోని యశోభూమి వేదికగా జరిగింది. దేశ ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించగా, ఇందులో యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ కూడా పాల్గొన్నారు. జాతీయ స్థాయిలో జరిగిన ఒక ప్రదర్శనలో తనకు ప్రశంసలు రావడంపై కడియం శ్రీనివాస్ మాట్లాడుతూ, ఢిల్లీలో జరిగిన ప్రదర్శనలో పాల్గొనడం కొత్త అనుభూతితో పాటు ప్రోత్సాహాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు.

తూత్తుకుడిలో మళ్ళీ పోటీకి కనిమొళి దరఖాస్తు



అరివాలయంలో తూత్తుకుడిలో పోటీకి దరఖాస్తు సమర్పిస్తున్న డీఎంకే ఎంపీ కనిమొళి

చెన్నై, మార్చి5 (ఆంధ్రజ్యోతి): రానున్న లోక్‌సభ ఎన్నికల్లో తూత్తుకుడి నియోజకవర్గంలో మళ్ళీ పోటీ చేయడానికి సిట్టింగ్ ఎంపీ కనిమొళి డీఎంకే అధిష్టానానికి దరఖాస్తు చేశారు. డీఎంకే ప్రధాన కార్యాలయం అన్నాఅరివాలయంలో ఈ నెల ఒకటి నుంచి డీఎంకే ఆశావహుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.ఈ నెల ఏడో తేదీ సాయంత్రం ఆరుగంటల వరకు దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుందని పార్టీ ప్రధాన కార్యదర్శి దురైమురుగన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం ఆమె తూత్తుకుడి నియోజకవర్గంలో మరోమారు పోటీ చేయడానికి దరఖాస్తు సమర్పించారు.ఇప్పటికే కనిమొళి తరపున సుమారు70 మందికి పైగా దరఖాస్తు చేశారు.ఈ విషయమై అరివాలయం వెలుపల ఆమె మీడియాతో మాట్లాడుతూ 2019లో తూత్తుకుడి నియోజకవర్గంలో నిలిచి గెలిచానని, ప్రస్తుతం నియోజకవర్గం ప్రజల విజ్ఞప్తి మేరకు మరోమారు ఆ నియోజకవర్గంలో పోటీ చేయాలని నిర్ణయించానని తెలిపారు. నియోజకవర్గం ప్రజల సమస్యలు తీర్చేందుకు తీవ్రంగా పాటుపడతానని చెప్పారు.

కోలాహలంగా కోవిలూర్ జల్లికట్టు పోటీలు

పెరంబూర్, మార్చి 5: పుదుకోట జిల్లా ఆలంగుడి సమీపం కోవిలూర్‌లో ఉన్న ముత్తు మారియమ్మన్ ఆలయ ఉత్సవాల సందర్భంగా జల్లికట్టు పోటీలు మంగళవారం నిర్వహించారు. ఈ పోటీలను రాష్ట్ర పర్యావరణ శాఖ మంత్రి మెయ్యనాథన్ ప్రారంభించారు. అనంతరం వడివాసన్ నుంచి ఆలయ ఎద్దును ముందుగా వదిలారు. అనంతరం పుదుకోట, తిరుచ్చి, తంజావూరు, దిండుగల్, మదురై తదితర జిల్లాలకు చెందిన 700 ఎద్దులు ఒకదాని తర్వాత మరొకటిని వదిలారు. వడివాసన్ నుంచి వస్తున్న ఎద్దులను అదుపుచేసేందుకు పలు బృందాలుగా 300 మంది యువకులు పోటీపడ్డారు. ఎక్కువ ఎద్దులు అదుపుచేసిన వీరులు, ఎవరికి దొరకకుండా వెళ్లిన ఎద్దుల యజమానులకు బంగారం, వెండి నాణేలు, సైకిల్, వంట పాత్రలు సహా పలురకాల బహుమతులు అందజేశారు. జల్లికట్టు మైదానం సమీపంలోని ఆరోగ్య, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటుచేసి, గాయపడిన యువకులకు ప్రథమ చికిత్స అందించారు. ఈ పోటీలను తిలకించేందుకు జిల్లా నుంచే కాకుండా పొరుగు జిల్లాలకు చెందిన ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఆలంగుడి ఏడీఎస్పీ పౌల్ రాజ్ నేతృత్వంలో పోలీసులు భద్రతా విధులు చేపట్టారు.



ఎద్దులను అదుపుచేస్తున్న యువకులు